
తల్లికి వందనం..గందరగోళం



స్కూల్‌కి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇస్తామన్న ప్రకటన ఇది..

ఎన్నికల ముందు ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. పథకం విధివిధానాల ప్రకారం.. ఒక్కో తల్లికి రూ.15,000 మాత్రమే ఆర్థిక సహాయం అంటూ మెలిక పెట్టారు. జీవో 29 ప్రకారం ఒక ఇంట్లో ఆధార్ కార్డు ఆధారంగా (ఆధార్ లేకుంటే దరఖాస్తు చేసుకోవాలని.. అది వచ్చేలోపు పది రకాల కార్డులను అనుమతిస్తామని చెప్పారు) అమ్మలకు తల్లికి వందనం వర్తింపజేయనున్నట్లు చంద్రబాబు ప్రభుత్వం పేర్కొంది. అంటే ఒక ఇంటికి రూ.15వేలు.. ఇంట్లో ఒక్కరికే వర్తింపజేయడమన్నమాట. అలాగే.. వైట్ రేషన్‌కార్డు లబ్ధిదారులకే పథకం వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఇంతకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసింది కూడా ఇదే కదా... కాకపోతే ఇప్పుడు ఆధార్ కార్డును తప్పనిసరిగా అనుసంధానం చేయాలని ప్రత్యేకంగా పేర్కొనడంతో పాటు విద్యార్థికి 75 శాతం హాజరు తప్పనిసరి, పేదరికం దిగువన లాంటి అంశాల్ని ప్రామాణికంగా తీసుకుంటామని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ పథకం అమలుపైనా ఎంతో ఆతృతగా ఎదురుచూసిన తల్లిదండ్రుల్లో ప్రభుత్వ మార్గదర్శకాలతో గందరగోళం నెలకొనగా, రానున్న రోజుల్లో ఇది లబ్ధిదారులకు కోత పెట్టే చంద్రబాబు మాయే నన్న చర్చ మరోవైపు నడుస్తోంది.

–డాబాగార్డెన్స్,అల్లిపురం, జగదాంబ

ఎన్నో అనుమానాలున్నాయి



తల్లికి వందనం సంబంధించి మా పిల్లలు చదివే స్కూల్ ఇప్పటి వరకు ఏ కబురు రాలేదు. పాఠశాలలు మొదలై నెలరోజులుకావస్తోంది. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందా? ఎన్ని నిబంధనలు పెడతారో?..ఈ ఏడాది ఇస్తారా? ఇలాంటి అనుమానాలెన్నో ఉన్నాయి. ప్రభుత్వం దీనిపై త్వరగా స్పష్టత ఇవ్వాలి.

–రమ, చిలకవీధి జీవీఎంసీ 39వ వార్డు

ఎప్పుడిస్తారో స్పష్టత లేదు



గత ప్రభుత్వంలో అమ్మ ఒడికి సంబంధించిన సచివాలయ సిబ్బంది తల్లి ఆధార్ కార్డు తీసుకున్నారు. తరువాత స్కూల్ యాజమాన్యమే మిగతా ప్రక్రియ పూర్తి చేసింది. దీని ఆధారంగా ఇంట్లో ఒక విద్యార్థికి అమ్మఒడిని ప్రభుత్వం అందజేసింది. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా వారికి తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు చెప్పారు. పాఠశాలలు ప్రారంభమైనా ఇంతవరకు దీనిపై ఇంకా స్పష్టత లేకపోవడంతో ఆందోళన నెలకుంది.

–ఉమామహేశ్వరి, ప్రసాద్‌గార్డెన్స్ , జీవీఎంసీ 35వ వార్డు

ఇద్దరు పిల్లలకూ ఇస్తారా?



మాకు ఇద్దరు పిల్లలున్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు చొప్పున తల్లి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. పాఠశాలలు పునః ప్రారంభమై నెల అవుతోంది. ఇప్పటి వరకూ తల్లికి వందనంపై పాఠశాలల యాజమాన్యాలకు ఎటువంటి వివరాలు తెలియవట. ప్రభుత్వం తల్లికి వందనం పథకం త్వరగా అమలు చేయాలి.కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకుంటే మా పిల్లలకు రూ.30 వేలు వస్తాయి. ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం.

–గంగా, దుర్గామాంబ సమాజం, జీవీఎంసీ 35వ వార్డు.

ఎప్పుడిస్తారో..



నాకు ఇద్దరు ఆడపిల్లలు. ప్రైవేటు పాఠశాలలో ఒకరు 6వ తరగతి, మరొకరు 7వ తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వంలో పాఠశాలల ప్రారంభమైన నెలలోనే అమ్మఒడి ఇచ్చారు. దీంతో స్కూలు యాజమాన్యాలు మాపై ఫీజుల కోసం ఒత్తిడి తీసుకువచ్చేవారు కాదు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లివందనం ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఇంతవరకు దీనిపై స్పష్టత లేదు. ఒకరికి ఒక్కరికి ఇస్తారో, ఇద్దరికి ఇస్తారో అర్థం కావడం లేదు.

–సొంటప్పు కనకమహాలక్ష్మి, నరహరిదొడ్డి.

ప్రభుత్వం స్పందించాలి



నాకు ఇద్దరు పిల్లలు. గత ప్రభుత్వంలో పాపకు అమ్మ ఒడి ద్వారా ఆర్థిక భరోసా లభించింది. దీంతో పాఠశాలకు పంపించి మంచిగా చదివిస్తున్నాను. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పేరిట రూ.15 వేలు ఇస్తామని పొందుపరిచింది. బడులు ప్రారంభమై ఇన్ని రోజులైనా కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు. పిల్లలను బడికి పంపించేందుకు ఆందోళన చెందుతున్నాం. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం నిధులు త్వరగా విడుదల చేయాలని ఆశతో ఎదురు చూస్తున్నాం.

–నాగమణి, మహారాణిపేట

క్లుప్తంగా

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న వాసుపల్లి



వేద ఆశీర్వచనం పొందుతున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. వేద ఆశీర్వచనం పొందారు.

ఎన్‌సీసీ 'బి' సర్టిఫికెట్ల అందజేత



బి సర్టిఫికెట్లతో కేడెట్స్

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీ 'బి' సర్టిఫికెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన పలువురు కేడెట్స్‌కు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల చేతుల మీదుగా సర్టిఫికెట్లను గురువారం అందజేశారు. కేడెట్స్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి, కేడెట్స్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

డాబాగార్డెన్స్: ఏపీఈపీడీసీఎల్ 11 కేవీ విద్యుత్ హెచ్‌టీ లైన్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు గురువారం పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొబ్బరితోట, జెండాచెట్టువీధి, అచ్చియ్యమ్మపేట, భూపేష్‌నగర్, అల్లిపురం, నేరేళ్లకోనేరు, కర్ణాలవీధి, అల్లిపురం, స్టేషన్‌రోడ్డు, అల్లిపురం సిగ్నల్ పాయింట్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

డైలీ లివింగ్ స్కిల్స్‌పై అవగాహన



స్టాఫ్ రిజిస్టర్,రికార్డులు పరిశీలిస్తున్న ఐఈ స్టేట్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ తదితరులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ మహారాణిపేట పరిధిలోని అచ్యుతరామ పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత (ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రం)ను ఐఈ స్టేట్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అమ్మినాయుడు, కో ఆర్డినేటర్ గీత, ఎంఈవో పుష్పరాగం గురువారం పరిశీలించారు. భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలు, అకడమిక్ యాక్టివిటీస్, విద్యార్థులు, స్టాఫ్ రిజిస్టర్‌తో పాటు పలు రికార్డులు పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులతో డైలీ లివింగ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అచ్యుతరామ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానం ఆవరణలో వెలసిన సుబ్రహ్మణ్య స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు బులుసు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేపట్టారు.

మహిళా కళాశాల విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్



అంధ విద్యార్థినులకు స్కాలర్‌షిప్పులు అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: స్వచ్ఛంద సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రోటరీక్లబ్ విశాఖ శాఖ గురువారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఐదుగురు అంధ విద్యార్థినులకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున స్కాలర్‌షిప్స్‌లను అందజేసింది. కళాశాలకు చెందిన ఐక్యూఏసీ ఆధ్వర్యంలో కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజులా మాట్లాడుతూ రోటరీక్లబ్ వాల్తేర్ తమ సేవా కార్యక్రమంలో భాగంగా కళాశాలకు చెందిన ఐదుగురు అంధ విద్యార్థినులకు ఈ స్కాలర్‌షిప్స్ అందజేయడం, అలాగే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో పనిచేసే కళ్లద్దాలను అందివ్వడం అభినందనీయమన్నారు. రోటరీక్లబ్ వాల్తేర్ ప్రెసిడెంట్ ఎస్ దేవానంద్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో ఇతరులకు సహాయం చేయాలన్నారు. రోటరీక్లబ్ మాజీ ప్రెసిడెంట్ ఎంవీ నారాయణరావు , విజన్ ఎయిడ్ సంస్థ వైస్‌చైర్మన్ అవసరాల శ్రీనివాస్ , రోటరీక్లబ్ వాల్తేర్ సెక్రటరీ కె. ప్రసన్నకుమార్, ప్రోగ్రామ్ కన్వీనర్ బి రాధమ్మ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ సంతోషి అనూష, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి, ఆంగ్ల అధ్యాపకురాలు సునీత పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 32 మంది ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫారాల అందజేత



విద్యార్థులకు యూనిఫారాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, పైడి రజని

డాబాగార్డెన్స్: విద్యార్థులకు తమ సేవలు కొనసాగుతూనే ఉంటాయని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవా) వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఏవీఎన్ కళాశాల ఇంగ్లిషు విభాగాధిపతి పైడి రజని పేర్కొన్నారు. ఏవీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఆమె గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం సింహాద్రినాయుడు చేతుల మీదుగా యూనిఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఆంగ్ల విభాగధిపతిగా, శక్తి సేవా సంస్థ అధ్యక్షురాలిగా పైడి రజని విద్యారంగ అభివృద్ధికి, సామాజిక సేవా రంగాల కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విభాగ ఇన్‌చార్జ్ అప్పారావు, స్వరాజ్యలక్ష్మి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ సమష్టి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్‌వో) ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ జరిగింది. రేసవానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్వర రావు మాట్లాడతూ పెరుగుతున్న జనాభాను నియంత్రించవలసిన అవసరం ఉందన్నారు. జనాభా పెరుగుదల వలన అభివృద్ధి తగ్గుతుందని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి ఇతర సమస్యలను పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు,వివిధ శాఖల అధికారులు డాక్టర్ జగదీష్ ప్రసాద్, ధర్మేంద్ర, విష్ణు, ఎస్.బేగం, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు శశి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభానికి రక్షణ



విద్యుత్ స్తంభానికి కాంక్రీట్ వేస్తున్న స్థానికులు

అల్లిపురం: నేడో..రేపో..విద్యుత్ స్తంభం కూలిపోతుందని పలుమార్లు సిబ్బందికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో అమ్మవారి వీధివాసులు రంగంలోకి దిగి విద్యుత్ స్తంభం కూలిపోకుండా చర్యలు తీసుకున్నారు. అమ్మవారివీధిలో ఎస్.ఎస్ 3ఎ/11/5 విద్యుత్ స్తంభం అడుగు తుప్పుపట్టి పడిపోయేలా ఉందని విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిర పల్లి రాము తెలిపారు. ఎట్టకేలకు సొంత ఖర్చులతో గురువారం విద్యుత్ స్తంభానికి కాంక్రీటు వేసి చర్యలు తీసుకున్నామన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

డాబాగార్డెన్స్: సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిట్రసీ ఆధ్వర్యంలో బ్యాంకింగ్‌లో జరుగుతున్న అన్యాయాలు, సైబర్ మోసాలపై ఏవీఎన్ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌బీఐ ఎస్ఎస్ఐ కౌన్సలర్లు నాగరాజు, శ్రీనివాసరావు, బాలకృష్ణ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారని, బ్యాంక్ అకౌంట్ నుంచి పెద్ద మొత్తంలో సొమ్ము నష్టపోతున్నారని, సైబర్ నేరాలు గమనించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, అకడమిక్ డీన్ శంకర్ నారాయణరావు, పైడి రజని, స్వరాజ్యలక్ష్మి, పి.గాంధీ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల భద్రత కోరాం

'అక్రమ నిర్మాణానికి వత్తాసు' కథనానికి అధికారి వివరణ

డాబాగార్డెన్స్: అక్రమ నిర్మాణానికి వత్తాసు పేరిట 'సాక్షి' గురువారం ప్రచురించిన కథనానికి జీవీఎంసీ జోన్–4 అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె.ఝాన్సీ లక్ష్మీ వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారుడు షేక్ జోహార్ ఇచ్చిన ఫిర్యాదుపై టౌన్‌ప్లానింగ్ క్షేత్రస్థాయిలో పరిశీలించామని, ఇంటి నిర్మాణం చేపట్టిన మహ్మద్ మహబూబ్ షరీఫ్ తన 47.03 గజాల స్థలంలో జీ+1 స్థానంలో గతంలో ఉన్న పాత కోలంస్‌పై శ్లాబ్ వేసి పెంట్ హౌస్ నిర్మిస్తున్నట్టు గుర్తించామన్నారు. నిర్మాణ పనులను తక్షణం నిలిపివేయాలని, ఏపీఎంఈ యాక్ట్ అనురించి వారం రోజుల్లో నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశించామన్నారు. అయినప్పటికీ స్పందన లేదన్నారు. ఈ విషయమై ఈ నెల 4న సెక్షన్ 452(2), 461(2) యాక్ట్ ప్రకారం మూడు రోజుల గడువులో నోటీస్ జారీ చేశామని, అప్పటికీ ప్రతిస్పందన లేదని తెలిపారు. ఫైనల్ నోటీస్ జారీ చేసి నిర్మాణ పనులపై చర్యలు చేపట్టేందుకు జీవీఎంసీ సిబ్బంది ప్రయత్నించగా, నిర్మాణదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైందన్నారు. దీంతో భద్రతను కోరుతూ ఈ నెల 9న వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో లిఖితపూర్వకంగా తెలియజేశామన్నారు.

రెండో శనివారం స్కూళ్లకు సెలవు ఇవ్వాలి

విశాఖ విద్య: రెండో శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు తప్పనిసరిగా సెలవు ప్రకటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి. సీతారాం ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రతీ నెలా రెండో శనివారం సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యా క్యాలెండర్ పనిదినాలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలకు సిఫార్స్ చేస్తామన్నారు. జిల్లాలో రెండో శనివారం, లేదా ఆదివారం రోజుల్లో ఎక్కడైనా స్కూళ్లు తెరిచి, తరగతులు నిర్వహిస్తే తల్లిదండ్రులు కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మాధవధార నుంచి ఆర్కే బీచ్‌కు సిటీ బస్సు సర్వీసు

డాబాగార్డెన్స్: ఉత్తర నియోజకవర్గ పరిధి మాధవధార, ఎన్‌జీవోస్ కాలనీ నుంచి ఆర్కేబీచ్, సింహాచలం బస్ కాంప్లెక్స్‌కు 48–ఎస్ రూట్ నంబర్‌తో సిటీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు పేర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల ప్రయాణికుల సౌకర్యార్థం సింహాచలం, ఆర్కే బీచ్‌కు వెళ్లేందుకు డైరెక్ట్‌గా ఈ సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆయా ప్రాంతాలకు రూట్ నంబర్ 48–ఎస్‌తో రెండు సిటీ సర్వీసులు తిప్పుతున్నట్టు చెప్పారు. ఈ బస్సులు ఆర్కే బీచ్ నుంచి బయలుదేరి కలెక్టర్ ఆఫీస్, జగదాంబ, సూర్యాబాగ్, డాబాగార్డెన్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, దొండపర్తి, అక్కయ్యపాలెం, మధుసూదన్ నగర్, మాధవధార వుడా కాలనీ, ఆర్ అండ్ బీ, ఎన్ఏడీ, గోపాలపట్నం మీదుగా సింహాచలం బస్ కాంప్లెక్స్‌కు చేరుతుందని, సింహాచలం బస్ కాంప్లెక్స్ నుంచి అదే మార్గంలో ఆర్కే బీచ్‌కు చేరునని ప్రజా రవాణా అధికారి చెప్పారు.

టైమింగ్స్ ఇలా..

ఆర్కే బీచ్ నుంచి బయలుదేరు సమయం ఉదయం 05:45, 06:45, 08:15, 09:15, 10:45, 11:45, మధ్యాహ్నం 1:55, 2:55, సాయంత్రం 5:25, 5:25, 6:55, రాత్రి 7:55

సింహాచలం నుంచి బయలుదేరు సమయం

ఉదయం 06:55, 07:55, 09:25, 10:25, 11:55, 12:55, మధ్యాహ్నం 3:05, సాయంత్రం 04:05, 05:35, 06:35, రాత్రి 08:20, 09:05

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి



వైద్య పరీక్షలు నిర్వహించి పలు జాగ్రత్తలు చెబుతున్న డాక్టర్ సూర్యతేజ

డాబాగార్డెన్స్: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ సూర్య తేజ వృద్ధులకు సూచించారు. పాతనగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాంగణంలో గురువారం ఉచితంగా బీపీ, షుగర్ తదితర వైద్య సేవలు నిర్వహించారు. ఆశ్రమంలో ఉన్న పలువురు వృద్ధులతో పాటు పరిసర ప్రాంతాల్లో గల పేదలకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడాలని, తగిన వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రసాద్‌నాయుడు, పుండరీకాక్షయ్య, కమల ప్రియ, మౌనిక, సాయి, రవి, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు పరికరాల అందజేత



డాక్టర్ సురేష్‌ను అభినందిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ ఏ.సురేష్ రూ.1.4 లక్షల విలువ చేసే తాత్కాలిక ఫేస్ మేకర్‌కు అవసరమైన పల్స్ జనరేటర్, లెడ్ పరికరం కేజీహెచ్ కార్డియాలజీ విభాగానికి గురువారం అందజేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ద్వారా డాక్టర్ సురేష్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మికి ఈ పరికారాన్ని అందజేశారు. తీవ్రమైన గుండె జబ్బుతో ఇబ్బంది పడే రోగులకు ఈ పరికరం అమర్చడం ద్వారా ప్రాణాలను కాపాడొచ్చు. ఏఎంసీ పూర్వ విద్యార్థి డాక్టర్ ఏ.సురేష్ ప్రస్తుతం మెడికవర్ ఆస్పత్రి (విశాఖ)లో ఎలక్ట్రో ఫిజియాలజిస్టు, కార్డియాలజిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. విలువైన పరికరాలు కేజీహెచ్‌కు అందజేసిన సురేష్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసరావు అభినందించారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి



మాట్లాడుతున్న 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి

అల్లిపురం: మహిళలు సామాజికంగా, ఆర్థికంగా బలపడడమే లక్ష్యంగా ప్రభుత్వం మిషన్ శక్తి కార్యక్రమం చేపట్టిందని 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి అన్నారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా వార్డులో అమ్మవారివీధి, అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అందించే సంక్షేమ పథకాలు, మహిళల రక్షణ చట్టాలు, వాటి ప్రయోజనాలు, బాలింతలకు, గర్భిణులకు జనని సురక్షయోజన, ప్రధానమంత్రి జనని, శిశు సురక్ష కార్యక్రమాలు, ప్రయోజనాలు, 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లల సంరక్షణ, 3 ఏళ్లు పైబడిన పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ముందుగా అమ్మవారివీధి, కుమ్మరవీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాలలో మిషన్ సురక్ష అవాగాహన ర్యాలీలో ఆమెతో పాటు ఏసీడీపీఓ లత, సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫార్మేషన్) కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌లాల్, మహిళా పోలీస్ నూర్జాహాన్, వార్డు ఆరోగ్య కార్యదర్శి తులసి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, చిన్నారుల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ నుంచి గంభీరానికి సిటీ బస్సు సౌకర్యం

డాబాగార్డెన్స్: భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విశాఖ రైల్వే స్టేషన్ నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ గంభీరానికి రూట్ నంబరు 25–ఐఐఎమ్ సిటీ బస్సు సౌకర్యం కల్పించినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు. ఈ బస్సు రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెం, హనుమంతువాక, మధురవాడ, మారికవలస మీదుగా ఐఐఎంకి చేరునని తెలిపారు.

రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరు సమయం..

ఉదయం 07:30, 10:20 మధ్యాహ్నం ఒంటిగంటకు..

ఐఐఎం నుంచి బయలుదేరు సమయం:

ఉదయం 08:55, 11:35, మధ్యాహ్నం 14.30, 18:15

వారాహి మాతకు అలంకరణ



దూమ్ర వారాహి అలంకరణలో వారాహి మాత



వారాహి మాతకు కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

అల్లిపురం: భక్తులతో విశేషంగా పూజలు అందుకుంటున్న అల్లిపురం, శ్రీ షిర్డీ సాయి దర్బార్‌లో వెలసిన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆరో రోజు కార్యక్రమంలో భాగంగా గురువారం వారాహి అమ్మవారిని దూమ్ర వారాహిగా గంధం, బాధంపప్పుతో విశేషంగా అలంకరించారు. దీంట్లో భాగంగా మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేపట్టారు.